సాక్షి తిరుపతి

ఆదివారం । 20 । ఆగస్టు । 2023



ఎర్రచందనం స్వాధీనం

అక్రమంగా తరలిస్తున్న ఎర్రచందనంతో పాటు ఇద్దరు స్మగ్లర్లను చంద్రగిరి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. - 8లో



షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధం

పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి ఓటేరు సమీపంలో షార్ట్ సర్క్యూట్‌తో ఓ కారు దగ్ధమైంది. - 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	37	25
చిత్తూరు	37	25
తిరుమల	33	22
గూడూరు	38	27
నగరి	38	26

న్యూస్‌రీల్

23న ముక్కంటి హుండీల లెక్కింపు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 23వ తేదీ బుధవారం ముక్కంటి ఆలయ హుండీ ఆదాయాన్ని లెక్కించనున్నట్లు ఈఓ సాగర్‌బాబు తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆలయంలోని గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద హుండీ కానుకలు లెక్కించనున్నట్లు వెల్లడించారు.

ఉచిత నర్సింగ్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి కల్చరల్: రాస్ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత ఏఎన్ఎం, ఎంపీహెచ్‌డబ్ల్యూ నర్సింగ్ కోర్సులకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రాస్ ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటరత్నం తెలిపారు. ఉమ్మడి చిత్తూరు, అనంతపురం జిల్లాల్లో ఇంటర్ ఉత్తీర్ణులై, 30 ఏళ్లలోపు వయస్సు కలిగిన మహిళా అభ్యర్థులు ఈ శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళలకు ఉచిత శిక్షణతో పాటు వసతి కల్పిస్తూ, నెలకు రూ.500 ప్రభుత్వ స్టైఫండ్ చెల్లించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థినులు సెప్టెంబర్ 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 8179769449, 9494685529లో సంప్రదించాలని ఆయన కోరారు.

24న తిరుమలనంబి అవతార మహోత్సవాలు

తిరుమల : ప్రముఖ వైష్ణవాచార్యులు తిరుమల నంబి 1050వ అవతార మహోత్సవాలను ఈనెల 24వ తేదీ తిరుమలలోని దక్షిణ మాడ వీధిలోని తిరుమలనంబి ఆలయంలో ఘనంగా నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా తిరుమల నంబి ఆలయంలో ఉదయం 9.30 గంటల నుంచి 16 మంది ప్రముఖ పండితులు తిరుమల నంబి జీవిత చరిత్రపై ఉపన్యసించనున్నారు. శ్రీవారి భక్తాగ్రేసరుల్లో ఒకరైన తిరుమలనంబి శ్రీ వేంకటేశ్వరస్వామివారికి తీర్థ కైంకర్యం ప్రారంభించారు. వీరు భగవద్రామానుజుల వారికి స్వయాన మేనమామ, గురుతుల్యులు. వీరు రామానుజుల వారికి రామాయణ పఠనం చేశారని పురాణాల ద్వారా తెలుస్తోంది.

వీనులవిందుగా సంగీతోత్సవాలు



అయ్యర్ సిస్టర్స్ గీతాలాపన

తిరుపతి కల్చరల్: త్యాగరాజ మండపంలో శనివారం ప్రముఖ సంగీత కళాకారులు అయ్యర్ సిస్టర్స్ గానం వీనులవిందు చేసింది. త్యాగరాజ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో త్యాగరాజ మండపంలో చేపట్టిన త్యాగ రాజ సంగీతోత్సవాలు శనివారం రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా అయ్యర్ సిస్టర్స్ శ్రీవిద్య, సుధ త్యాగరాజ సంకీర్తలను ఆలపించి సభికులను అలరించారు. ఎంఎస్.అనుమృత సంగీత కచేరి, తిరుపతి శ్రీవాణి యల్లా ప్రదర్శించిన వీణా వాయిద్య సంగీతం ప్రేక్షకులను ఓలలాడించింది. కళాకారులను త్యాగరాజ ఉత్సవకమిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ మోహన్ సుందరం, కార్యదర్శి కంచి రఘురామ్, కోశాధికారి ప్రభాకర్, భీమాస్ అశోక్ సత్కరించారు.

ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులకు ఉచిత వైద్యం

తిరుపతి కల్చరల్: దేవేంద్ర థియేటర్ రోడ్డులోని మేఘన దంత వైద్యశాలలో ఏపీఎస్ ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత దంత వైద్యం అందిస్తున్నట్లు ఆస్పత్రి డాక్టర్ హేమాద్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఈ నెల 17వ తేదీన విజయవాడలో ఆర్టీసీ యాజమాన్యంతో ఎంఓయూ చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఏపీఎస్ ఆర్టీసీ నిర్దేశించిన దంత చికిత్సలన్నీ ఉద్యోగులకు అందించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సంక్షేమ విజయం!

'పేదల అభ్యున్నతే లక్ష్యం.. కులమతాలు, పార్టీలు చూడం' అంటూ క్షేత్రస్థాయిలో ప్రజల ముంగిటకే చేరుతున్న సంక్షేమ పథకాలకు మరోసారి గ్రామీణులు జైకొట్టారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా అధికార పార్టీ అభిమానులకు బాసటగా నిలిచారు. శనివారం జరిగిన సర్పంచ్ ఉపఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులను భారీ మెజారిటీతో గెలిపించారు. తిరుపతి జిల్లాలో జరిగిన ఏకైక సర్పంచ్ స్థానాన్ని సంక్షేమ సారథి, సీఎం జగనన్నకు బహుమతిగా ఇచ్చారు. వార్డు సభ్యులు సైతం సగర్వంగా తలెత్తుకునేలా భారీ మెజారిటీని అందించారు. ఊహకందని రీతిలో టీడీపీ మద్దతుదారులను మట్టికరిపించారు. కుట్రలు, కుతంత్రాలు, డబ్బు, మద్యానికి లొంగమని చాటిచెప్పారు. ఈ క్రమంలో టపాసులు కాల్చుతూ.. మిఠాయిలు పంచుతూ విజయోత్సాహంతో వైఎస్సార్‌సీపీ అభిమానులు సందడి చేశారు.

- సర్పంచ్ ఉపఎన్నికల్లో అధికారపార్టీ మద్దతుదారుల హవా
- ఘోర ఓటమిపాలైన టీడీపీ మద్దతుదారులు
- చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో వైఎస్సార్‌సీపీ ఫ్యాన్స్ విజయోత్సవాలు



శాంతిపురంలో వైఎస్సార్‌సీపీ అభిమానుల విజయోత్సవ ర్యాలీ



అడవికొడియంబేడు సర్పంచ్ కిరణ్‌కుమార్ విజయంతో అభిమానుల ఉత్సాహం

సాక్షి, తిరుపతి: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో శనివారం జరిగిన సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు విజయఢంకా మోగించారు. అనుకోని కారణాలతో ఎన్నికలు అనివార్యమైనా ప్రతిపక్ష పార్టీ నేతల మద్దతుతో బరిలో నిలిచిన ఆ పార్టీ మద్దతుదారులకు ఘోర ఓటమి తప్పలేదు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఇల్లు నిర్మించుకుంటున్న శాంతిపురం మండలంలోని పదో వార్డులో సైతం వైఎస్సార్‌సీపీ మద్దతుదారు విజయకేతనం ఎగురవేశారు. వైఎస్సార్‌సీపీ బలపరిచిన సుధాకర్ వార్డు మెంబర్‌గా 47 ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొందారు. వరుస ఓటములతో ఇదేం ఖర్మరా బాబూ అంటూ తెలుగు తమ్ముళ్లు లోలోపలే కుమిలిపోతున్నారు.

తిరుపతి జిల్లాలో..

తిరుపతి జిల్లాలో మొత్తం 5 సర్పంచ్, 41 వార్డు స్థానాలకు ఉప ఎన్నికల నోటిఫికేషన్ ఈనెల 7న జారీఅయ్యింది. ఇందులో 4 సర్పంచ్ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు ఏకగ్రీవమయ్యారు. 41 వార్డు స్థానాలకుగాను 34 వార్డుల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు ఏకగ్రీవమయ్యారు. శనివారం ఒక సర్పంచ్, 7 వార్డు మెంబర్ స్థానాలకు ఎన్నికలు నిర్వహించగా.. అందులో పిచ్చాటూరు మండలం, అడవికొడియంబేడు సర్పంచ్ స్థానాన్ని వైఎస్సార్‌సీపీ మద్దతుదారు కిరణ్‌కుమార్ కైవశం చేసుకున్నారు. ఇక జిల్లా వ్యాప్తంగా ఏడు వార్డులకు జరిగిన ఎన్నికల్లో ఆరు వార్డుల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు విజయకేతనం ఎగురవేయగా.. ఒక వార్డులో టీడీపీ మద్దతుదారు గెలుపొందారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సర్పంచ్ ఉప ఎన్నికల సమాచారం

సర్పంచ్ స్థానాలు	ఏకగ్రీవం	ఎన్నికలు	విజయం
08	07	01	వైఎస్సార్‌సీపీ మద్దతుదారు విజయం

చిత్తూరు జిల్లాలో..

చిత్తూరు జిల్లాలో మొత్తం 3 సర్పంచ్, 46 వార్డు స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. ఇందులో 3 సర్పంచ్ స్థానాల్లోనూ వైఎస్సార్‌సీపీ మద్దతుదారులే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 46 వార్డు స్థానాలకుగాను 37 వార్డుల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు ఏకగ్రీవంకాగా.. 2 వార్డులకు నామినేషన్లు దాఖలు కాలేదు. మిగిలిన 7 వార్డులకు ఎన్నికలు నిర్వహించగా.. ముగ్గురు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు, నలుగురు టీడీపీ మద్దతుదారులు గెలుపొందారు.

తిరుపతి జిల్లా మొత్తం 41 వార్డులు

- ఎన్నికలు జరిగినవి - 40
- ఎన్నికలు జరగనివి - 01
- వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు - 38
- టీడీపీ మద్దతుదారులు - 2

చిత్తూరు జిల్లాలో వార్డులు 46

- ఎన్నికలు జరిగినవి 44
- వైఎస్సార్‌సీపీ మద్దతు - 39
- టీడీపీ మద్దతు - 5

పకడ్బందీగా ఎన్నికలు

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో శనివారం జరిగిన సర్పంచ్ ఉప ఎన్నికలకు పోలీసులు భారీ భద్రత ఏర్పాటు చేశారు. ఎన్నికలు జరిగిన ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీ బందోబస్తును సమకూర్చారు. పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు నిత్యం పర్యవేక్షణ చేశారు. కౌంటింగ్ ప్రక్రియ అనంతరం గెలుపొందిన అభ్యర్థుల వివరాలను ప్రకటించారు.

ఆదిలోనే ఓటమి రుచిచూపించారు

చంద్రబాబు రాజకీయాల్లోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు జరిగిన ఎన్నికల్లో ఘోర పరాభవం తప్పడం లేదు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నాడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి నాయకత్వానికి పట్టం కడితే.. నేడు ఆయన తనయుడు వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి జై కొడుతున్నారు. అటు సార్వత్రిక ఎన్నికలు.. ఇటు స్థానిక ఎన్నికల్లో వైఎస్సార్, వైఎస్ జగన్ ప్రభంజనం కొనసాగుతోంది. తాజాగా జరిగిన సర్పంచ్, వార్డు ఉప ఎన్నికల్లోనూ చంద్రబాబుకు ఘోర పరాభావం తప్పలేదు. కుప్పం నియోజక వర్గం, శాంతిపురం మండలం, ఏడవ మైలు వద్ద సొంత ఇల్లు నిర్మించుకుంటున్న 10 వార్డులో టీడీపీ బలపరిచిన అభ్యర్థికి ఓటమి తప్పలేదు. వైఎస్సార్‌సీపీ బలపరిచిన సుధాకర్‌కే స్థానికులు ఓట్లేసి గెలిపించడం విశేషం. 2019 సాధారణ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో 14 అసెంబ్లీ స్థానాలకు గాను టీడీపీ గెలుచుకుంది కేవలం ఒకే స్థానం. అది కూడా చంద్రబాబు ప్రాతినిథ్యం వహించిన కుప్పం. మిగిలిన 13 అసెంబ్లీ, చిత్తూరు, తిరుపతి, రాజంపేట పార్లమెంట్ స్థానాలు సైతం వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు కైవశం చేసుకున్న విషయం తెల్సిందే.

స్థానిక ఎన్నికల్లోనూ ఘోర పరాభవం

ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీ ప్రభంజనం కొనసాగింది. కార్పొరేషన్, మున్సిపాలిటీలు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాల్లోనూ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు పట్టం కట్టారు. కుప్పం నియోజకవర్గంలో నాలుగు జెడ్పీటీసీ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించింది. 68 ఎంపీటీసీ స్థానాల్లో 65 వైఎస్సార్‌సీపీ అభ్యర్థులే గెలుపొందారు. 94 సర్పంచ్ స్థానాల్లో 83 వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థులే విజయం సాధించారు. ఆ తరువాత జరిగిన కుప్పం మున్సిపల్ ఎన్నికల్లో 19 వార్డుల్లో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లే గెలుపొందారు. టీడీపీ కేవలం 6 కౌన్సిలర్లకే పరిమితమైంది.

విజయోత్సాహం

వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు విజయోత్సాహంతో ర్యాలీలు నిర్వహించారు. గెలుపొందిన అభ్యర్థులను పూలమాలలతో గ్రామీణులు సత్కరించారు. అభ్యర్థులను భుజాల మీద మోసుకుంటూ గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. మిఠాయిలు పంచిపెట్టారు.

డాక్టర్లు భగవత్ స్వరూపులు

- రోగులకు ప్రేమతో సేవలందించండి
- టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి పిలుపు



మాట్లాడుతున్న ఈఓ ఏవీ ధర్మారెడ్డి

తిరుపతి తుడా: స్విమ్స్‌కు వచ్చే రోగులకు డాక్టర్లు ప్రేమతో, నిబద్ధతతో సేవలందించాలని టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. స్విమ్స్ డైరెక్టర్ సదాభార్గవి ఏర్పాటు చేసిన డాక్టర్లతో సమావేశానికి ఈఓ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. డాక్టర్లు భగవత్ స్వరూపులని, వారిపై నమ్మకం ఉంచి వారిచ్చే చికిత్సను నియమానుసారం కొనసాగిస్తారని చెప్పారు. అంతటి గొప్ప స్థితిలో ఉన్న డాక్టర్లు రోగులకు చక్కగా సేవలందించాలని, స్విమ్స్ అభివృద్ధికి దోహదపడాలని ఆయన కోరారు. తిరుపతిని మెడికల్ హబ్‌గా తీర్చి దిద్దేందుకు టీటీడీ కృషి చేస్తోందన్నారు. బర్డ్, ఆయుర్వేద, చిన్న పిల్లల ఆస్పత్రుల పనితీరు మెరుగుపడిందని, అదే స్థాయిలో స్విమ్స్ ఆస్పత్రి డాక్టర్లు ప్రణాళిక బద్ధంగా పనిచేయాల్సి ఉందన్నారు. స్విమ్స్‌లోని డాక్టర్లు ఎంతో నైపుణ్యం కలిగి ఉన్నారని, విభాగాల వారీగా వారికి అవసరమైన సిబ్బంది, అత్యాధునిక వైద్య పరికరాలు, ఆపరేషన్ థియేటర్లు టీటీడీ అందిస్తుందని తెలిపారు. గత సమావేశంలో వివిధ విభాగాలకు చెందిన డాక్టర్లు ఇచ్చిన అభిప్రాయాల ఆధారంగా చేసుకుని, సమస్యలను 90 శాతం పరిష్కారం చేశామన్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి వివిధ విభాగాలకు చెందిన డాక్టర్లు అంతర్గత సమావేశాలు నిర్వహించాలని, డైరెక్టర్ నెలకు ఒకసారి సమావేశం ఏర్పాటు చేసి పెండింగ్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. టీటీడీ ఎఫ్ఏఅండ్ సీఏఓ బాలాజీ స్విమ్స్ అభివృద్ధికి టీటీడీ ఖర్చు చేస్తున్న నిధుల వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ (పీపీటీ) ద్వారా వివరించారు. సిమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, సీఈ నాగేశ్వరరావు, అదనపు ఎఫ్ఏ అండ్ సీఏఓ రవిప్రసాద్ పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 14 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 17 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 61,904 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. 31,205 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.42 కోట్లు సమర్పించారు. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 14 గంటల్లో దర్శనం లభిస్తోంది.

శరవేగంగా ఆధ్యాత్మిక నగర అభివృద్ధి

తిరుపతి అర్బన్: ఆధ్యాత్మిక నగర అభివృద్ధికి అంతా భాగస్వాములు కావాలని డిప్యూటీ సీఎం, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కే.నారాయణస్వామి పిలుపునిచ్చారు. గడచిన నాలుగేళ్లలో తిరుపతి నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతోందని చెప్పారు. శనివారం కలెక్టరేట్‌లో తిరుపతి నియోజకవర్గ అభివృద్ధిపై స్థానిక ఎమ్మెల్యే, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష, డెప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి, జేసీ డీకే.బాలాజీ, కమిషనర్ హరిత, ఆర్డీఓ కనకనరసారెడ్డి, అన్ని విభాగాల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా డెప్యూటీ సీఎం ముందుగా టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డిని సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అభివృద్ధికి సంబంధించి స్థానిక ఎమ్మెల్యేలు సూచించిన అంశాలకు అధికారులు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. తిరుపతి నగరాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడానికి అంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఆశించిన మేరకు ఫలితాలను సాధించడానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి మాట్లాడుతూ ఏపీ టిడ్కో ఇండ్లు నిర్మాణాలకు సంబంధించి పేమెంట్ పనులను త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. అలాగే యుద్ధ ప్రాతిపదికన దశల వారీగా ఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సర్టిఫికెట్ల జారీ చేయడంలో జాప్యం లేకుండా చూడాలన్నారు. సచివాలయం, రైతుభరోసా కేంద్రం, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ తదితర ప్రభుత్వ ప్రాధాన్యతా భవన నిర్మాణాలు సకాలంలో పూర్తికావాలని కోరారు. ఈ సమావేశంలో తిరుపతి మున్సిపల్ అడిషనల్ కమిషనర్ సునీత, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.



తిరుపతి నియోజకర్గ అభివృద్ధిపై అధికారులతో సమీక్షిస్తున్న డెప్యూటీ సీఎం నారాయణస్వామి,ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష, డెప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డి, కమిషనర్ హరిత

సెక్షన్ 22(ఏ)సమస్యపై చర్చ

తిరుపతిలో స్థలాల రిజిస్ట్రేషన్ నిలుపుదలకు ఉద్దేశించిన సెక్షన్ 22 (ఏ)ను తిరుపతి ఎమ్మెల్యే, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లినట్లు వివరించారు. ప్రధానంగా నగర పాలక సంస్థ పరిధిలోని తంబువానిగుంట, కొర్లగుంట, కొత్తపల్లి, చంద్రశేఖర్‌రెడ్డి కాలనీ, ఎరుకల కాలనీ, జర్నలిస్ట్ కాలనీ, కసంగడ్డ– కెనడీ నగర్, భగత్ సింగ్ కాలనీ, సుందరయ్యనగర్, శారధినగర్, సూరయ్యకట్ట, చెన్నారెడ్డి కాలనీ, సంజీవయ్యనగర్, సింగాలగుంట, నరసింహ తీర్థం రోడ్డు, తాతయ్యగుంట, బొమ్మగుంట ప్రాంతాలకు సంబంధించిన స్థలాల రిజిస్ట్రేషన్లు కాకుండా నిలుపుదల చేశారని, దీంతో ఐదు వేల నివాస గృహాల వరకు క్రయవిక్రయాలు జరగకుండా ఆగిపోయినట్టు వివరించారు. ఈ సమస్య పరిష్కారం దిశగా రెవెన్యూ శాఖ కృషిచేస్తున్నట్లు అధికారులు వివరించారు.

ఉత్పత్తిలో చైనాతో పోటీ



టైల్స్ ఔట్‌లెట్‌ను జ్యోతి వెలిగించి ఆరంభిస్తున్న పరిశ్రమ ఎండీ కృష్ణంరాజు

చిల్లకూరు: వ్యాపార అభివృద్ధితో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ ఉత్పత్తిలో చైనాతో పోటీ పడేలా అంజనీటెక్ టైల్ రంగాన్ని తీర్చి దిద్దేందుకు ప్రయత్నిస్తున్నట్టు పరిశ్రమ ఎండీ కేవీ కృష్ణంరాజు తెలిపారు. చిల్లకూరు మండలం, బూదనం సమీపంలోని జాతీయ రహదారి పక్కనే ఉన్న ఏ–5 హోటల్ ప్రాంగణంలో శనివారం అంజనీ టెక్ టైల్ షోరూం (ఔట్‌లెట్)ను జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు గృహాలు, కార్యాలయాలు, హోటళ్లు లాంటివి ఎన్నో అందంగా ఉండేలా తీర్చి దిద్దేందుకు యజమానులు ప్రయత్నిస్తున్నారని, అలాంటి వారి ఆలోచనలు ముందుగానే గుర్తించి నూతన సాంకేతికతను జోడించి టెక్ టైల్స్‌ను రూపొందించినట్టు తెలిపారు. చిల్లకూరు మండలంలోని ఓడూరు సమీపంలో 2016లో స్థాపించిన పరిశ్రమ నేడు దేశ విదేశాలకు టెక్‌టైల్స్‌ను సరఫరా చేస్తున్నట్టు వెల్లడించారు. అయితే టెక్ టైల్స్‌లో చైనా ముందు స్థానంలో ఉందన్నారు. ప్రస్తుతం కొన్ని వేల రకాల డిజైన్లు ఉన్నప్పటికీ కొంత మంది కస్టమర్లు పలు రకాలుగా టైల్స్ కావాలని ఆసక్తిని చూపిస్తుంటారని, వారి స్థాయికి తగ్గ విధంగా ఉత్పత్తిని పెపొందించేలా చూస్తున్నామన్నారు. ఔట్ లెట్‌లో టైల్స్‌ను చూసిన వారికి ఇంకా అవసరమైతే సమీపంలోని పరిశ్రమను కూడా వారు విజిట్ చేసే అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ ఏ.దేవరాజ్, కే.శ్రీనివాసులరెడ్డి, ఏ–5 అధినేత బద్రిగిరి, హెచ్‌ఆర్ జీఎం సతీష్‌చంద్ర, హెచ్‌ఆర్ ఏజీఎం వడయార్ పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధం

తిరుచానూరు(చంద్రగిరి): పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి ఓటేరు సమీపంలో శనివారం సాయంత్రం షార్ట్ సర్క్యూట్‌తో ఓ కారు దగ్ధమైంది. పోలీసుల కథనం మేరకు.. తిరుచానూరుకు చెందిన యశ్వంత్ స్నేహితులతో కలిసి కారులో తిరుపతిలోని బైరాగిపట్టెడకు బయలుదేరాడు. ఓటేరు వద్దకు వచ్చేసరికి కారు ఇంజిన్ నుంచి మంటలు రావడం చూసి కిందకు దిగేశారు. నిమిషాల వ్యవధిలోనే కారు పూర్తిగా కాలిపోయింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

483 విద్యుత్ చౌర్యం కేసుల నమోదు

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలో శుక్రవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ట్రాన్స్‌కో 8 డివిజన్ల పరిధిలోని విద్యుత్ సర్వీసులను సిబ్బంది తనిఖీ చేశారు. మొత్తం 3,031 సర్వీసులు తనిఖీ చేశారు. ఇందులో తిరుపతి ఆపరేషన్ పరిధిలో 104, తిరుపతి రూరల్ 66, పుత్తూరు 71, చిత్తూరు అర్బన్ 52, చిత్తూరు రూరల్ 37, మదనపల్లె 82, పీలేరు 22, పుంగనూరు పరిధిలో 49 విద్యుత్ చౌర్యం, అపరాధరుసుం పరంగా కేసులు నమోదు చేశారు.

సాక్షి ఫొటో గ్రాఫర్‌కు సత్కారం



జాతీయ స్థాయి అవార్డు అందుకుంటున్న సాక్షి ఫొటో గ్రాఫర్ కేతారి మోహన్‌కృష్ణ

తిరుపతి కల్చరల్: జాతీయ స్థాయి అవార్డుకు ఎంపికైన తిరుపతికి చెందిన సాక్షి ఫొటోగ్రాఫర్ కేతారి మోహన్‌కృష్ణను ఆంధ్రప్రదేశ్ ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్ జాతీయ అవార్డుతో శనివారం ఘనంగా సత్కరించింది. అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి ఫొటో కాంపిటేషన్ నిర్వహించారు. ఈ పోటీలలో ఉత్తమ ప్రతిభా ఛాయా చిత్రాన్ని అందించిన కేతారి మోహన్ కృష్ణకు జాతీయ స్థాయి అవార్డు లభించింది. ఈమేరకు శనివారం విజయవాడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన బహుమతుల ప్రదానోత్సవంలో ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, మాజీ మంత్రి ఎల్లంపల్లి శ్రీనివాసులు, ఏపీ ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు మల్లాది విష్ణు చేతుల మీదుగా ఆయన జాతీయ అవార్డును అందుకున్నారు.

నేటి నుంచి ఆరాధనోత్సవాలు



సొరకాయలస్వామి ఆలయం

నారాయణవనం: మండలంలోని సొరకాయలస్వామి జీవసమాధి 121వ మహా గురుపూజ ఆరాధనోత్సవాలకు ఆదివారం ఉదయం ధ్వజారోహణం నిర్వహించనున్నారు. పది రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాల్లో రోజూ ఉదయం 9 గంటలకు ప్రత్యేక అభిషేకాలు, మధ్యాహ్నం 12 గంటలకు ఆలయ ప్రాంగణంలో భక్తులకు ఉభయదారులచేత అన్నదాన ప్రసాద వితరణ ఏర్పాటు చేసినట్టు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం సహస్ర కలశాలను స్థాపించి ప్రత్యేక హోమాలు, అనంతరం ఉభయదారులతో మూలవర్లకు కలశ జలాలతో అభిషేకం ఉంటుందన్నారు. సాయంత్రం పురవీధుల్లో సొరకాయల స్వామి ఉత్సవర్ల ఊరేగింపు ఉంటుందని చెప్పారు.

ఎర్రచందనం సహా కారు స్వాధీనం

చంద్రగిరి: అక్రమంగా తరలిస్తున్న ఎర్రచందనంతో పాటు ఇద్దరు స్మగ్లర్లను చంద్రగిరి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు శనివారం సీఐ రాజశేఖర్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... శ్రీవారి మెట్టు దగ్గర గల ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో వాహనాలను తనిఖీ చేయగా.. ఓ కారు అనుమానాస్పదంగా తిరుగుతూ, పోలీసులను చూసి ఇద్దరు వ్యక్తులు కారు దిగి పరుగులు తీశారన్నారు. అనుమానం వచ్చి కారును తనిఖీ చేయగా అందులో రూ.6 లక్షల విలువైన 8 ఎర్రచందనం దుంగలు ఉన్నట్టు గుర్తించామన్నారు. ఎర్రచందనంతో పాటు తమిళనాడుకు చెందిన శివకుమార్, కడపకు చెందిన మహేంద్రను అరెస్ట్ చేసినట్టు వెల్లడించారు. శక్తివేలు, సుధాకర్, రాజశేఖర్ పరారైనట్లు వివరించారు. ఈ ఎర్రచందనం దుంగలను తమిళనాడుకు చెందిన ఇంటర్నేషనల్ స్మగ్లర్ సత్యరాజ్ గోడౌన్‌కు తరలిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వెల్లడించారు.